క్లుప్తంగా

ఆహ్వానం



ఆర్డీఓకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: అనంతపురం జిల్లా ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 22 వరకూ జరిగే అనంత చిరుధాన్యాల పండుగ కార్యక్రమానికి బుధవారం రెడ్స్ సంస్థ ప్రతినిధి యల్లప్ప ఆర్డీఓ సన్నీవంశీ క్రిష్ణకు ఆహ్వానం పలికారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్, ఏడీఏ సత్యనారాయణకు కూడా ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆదినారాయణ, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లింగన్న

నల్లచెరువు: మండల పరిధిలోని గాజేఖాన్‌పల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వాహనదారులకు ఎస్‌ఐ లింగన్న బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. వాహన దారులు రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడకుడా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి, డి.చెర్లోపల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీదేవి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డి.చెర్లోపల్లి పంచాయతీలో ఓసీ మహిళ, నల్లబోయనపల్లి పంచాయతీలో బీసీ జనరల్ కేటగిరిలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలను గ్రామ సచివాలయ అధికారులతో తెలుసుకోవాలని సూచించారు.

'హిట్ అండ్ రన్' నిబంధనపై పునరాలోచించాలి



ఏఎస్‌ఐ సురేంద్రకు వినతిపత్రం అందిస్తున్న డ్రైవర్లు

నల్లమాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న హిట్ అండ్ రన్ నిబంధనపై పునరాలోచించాలని పలువురు డ్రైవర్లు కోరారు. మండలంలోని ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు బుధవారం ఏపీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ కొత్త చట్టంలో డ్రైవర్లకు సంబంధించి నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదం చేసిన డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 లక్షలు జరిమానా విధిస్తే అతని జీవితం అంధకారమవుతుందన్నారు. ప్రమాదవశాత్తు తప్ప కావాలని ఏ డ్రైవరు తప్పు చేయరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి హిట్ అండ్ రన్ కఠిన నిబంధనను ఉపసంహరించాలని వారు కోరారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అలివేలమ్మ

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ అలివేలమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో భానుకోట జట్టుపై ముక్తాపురం, యలకుంట్లపై పాతపాళ్యం జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నీరు పుష్కలం.. రైతుకు అభయం

- తగ్గని భూగర్భ జలాలు
- జోరుగా పంటల సాగు
- కూలీలకు చేతి నిండా పనులు



నీటితో కళకళలాడుతున్న ధర్మవరం చెరువు



రేగాటిపల్లి చెరువులో జలసిరి

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలంలోని పోతుకుంట, గొట్లూరు, ధర్మవరం, కామిరెడ్డిపల్లి రావుల చెరువు, రేగాటిపల్లి చెరువులతో పాటు మరికొన్ని చెరువులలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో విస్తారంగా వేరుశనగ, కాయగూరల పంటలను సాగు చేశారు. నీరు అందుబాటులో ఉండడంతో చెరువు సమీపంలో ఉన్న బోరు బావుల్లో నీరు సమృద్ధిగా వస్తోంది. రైతులు మెట్ట భూములలో కూడా పంటలను సాగు చేస్తున్నారు. అయితే, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారంటూ లేనిపోని ఆరోపణలు చేస్తుండడంపై గ్రామీణులు మండిపడుతున్నారు.

దండిగా పనులు

బోరు బావులలో నీరు సమృద్ధిగా వస్తుండడంతో రైతులకు కూలీలు దొరక్క ఇతర గ్రామాల నుంచి ఆటోల్లో పిలుచుకొని వచ్చి అధిక కూలీ చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. చేతి నిండా పనులతో పాటు అధిక కూలీ వస్తుంటే తాము గ్రామాలు వదిలి ఎందుకు వలసపోతామని కూలీలు అంటున్నారు.

నాలుగేళ్లుగా జలకళ

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కరువుతో పనులు లేక కుటుంబ పోషణకు చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస పోయారు. తాగు, సాగునీరు లేక గుక్కెడు నీటి కోసం గ్రామీణులు అల్లాడిపోయారు. ఏడాదికి మూడు పంటలు పండే భూములన్నీ బీడుగా ఉండేవి. పశుగ్రాసం లేక రైతులు పశువులను అమ్ముకున్నారు. అయితే, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే, సకాలంలో వర్షాలు కురిసి చెరువులన్నీ మరువలు పారాయి. ఈ నాలుగేళ్లలో చెరువులన్నీ పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకున్నాయి. బీడు భూములన్నీ సస్యశ్యామలంగా మారాయి. రైతులు ఏడాదికి మూడు పంటలను సాగు చేసుకుంటున్నారు.

ప్రస్తుతం చెరువుల వివరాలు ఇలా..

- ధర్మవరం చెరువు నీటి సామర్థ్యం 370.30 క్యూబిక్ మీటర్లు. ప్రస్తుతం హంద్రీనీవా నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో చెరువులో సగ భాగం కంటే ఎక్కువగానే నీరు ఉంది.
- గొట్లూరు చెరువు 90.20 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలది. ప్రస్తుతం చెరువులో 40 శాతం మేర నీరు ఉంది.
- రావులచెరువు నీటి సామర్థ్యం 48.44 క్యూబిక్ మీటర్ల కెపాసిటీ. చెరువులో నీరు 20 శాతం వరకు నీటి నిల్వ ఉంది.
- రేగాటిపల్లి చెరువు 40.45 క్యూబిక్ మీటర్ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 40 శాతం మేర నీళ్లు ఉన్నాయి.
- పోతుకుంట చెరువు 13.98 క్యూబిక్ మీటర్ సామర్థ్యం. ప్రస్తుతం 20 శాతం నీరు ఉంది.



కొత్తగా వేసిన బోరు బావిలో పుష్కలంగా వస్తున్న నీరు

క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్రా'



క్రికెట్ పోటీల విజేత బత్తలపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు, అధికారులు

బత్తలపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ సాయిమనోహర్, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి అన్నారు. బుధవారం బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో మండలస్థాయి లీగ్ పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల స్థాయిలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. పురుషుల విభాగంలో వాలీబాల్‌లో ఈదుల ముష్టూరుపైన బత్తలపల్లి-2 జట్టు, బాడ్మింటన్‌లో బత్తలపల్లి-2పై బత్తలపల్లి-1 జట్టు, కబడ్డీలో సంజీవపురం జట్టుపైన బత్తలపల్లి-2, కోకోలో బత్తలపల్లి-2 జట్టు, క్రికెట్‌లో దంపెట్లపైన బత్తలపల్లి-2 జట్టు గెలుపొందినట్లు తెలిపారు. మహిళ విభాగంలో కబడ్డీలో బత్తలపల్లి-2, కోకోలో బత్తలపల్లి-2 జట్లు గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఈ జట్లు నియోజకవర్గస్థాయిలో పోటీలు పడనున్నట్లు చెప్పారు. బుధవారం దంపెట్ల-బత్తలపల్లి-2 జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచు అక్కిం దామోదర్, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు వేల్పుమడుగు నరేంద్రరెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, ఎస్.హరి, వ్యాపారం పెదయ్య, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: కంటిచూపు తగ్గిన పేద ప్రజలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి కంటిచూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటిచూపు తగ్గిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, క్యాంపు చైర్మన్ సుదర్శన్‌గుప్త మాట్లాడుతూ శిబిరంలో 110 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, 72 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారన్నారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని వారు తెలిపారు. దాతలను క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మ, పీఆర్‌ఓ శివప్రకాష్, రోటరీక్లబ్ సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శివయ్య, రామకృష్ణ, మనోహర్‌గుప్త, రమేష్ బాబు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకెళ్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి

తనకల్లు: వచ్చే ఎన్నికల్లో సమష్టిగా ముందుకెళ్లి కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండల పరిధిలోని టీ.సదుంలో పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం లభించేలా చేస్తాయని పేర్కొన్నారు. కదిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని, వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కదిరి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికల్లా పని చేయాలి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, నాయకులు చిన్నపరెడ్డి, జనార్దన్ రెడ్డి, రెడ్డిపీరా, గౌస్‌పీర్, రమణారెడ్డి, నీలకంఠారెడ్డి, ముస్తాఫా, మోహన్, మధురెడ్డి, రేవంత్‌రెడ్డి, టైలర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

తాడిమర్రి: మండలంలో సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సిబ్బంది బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. తాడిమర్రి, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, పెద్దకోట్ల, పిన్నదరి, దాడితోట, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది చిన్నారులకు బీసీజీ, ఎంఎంఆర్, డీపీటీ, నిమోనియా, పెంటా, హెపటైటిస్ బీ తదితర టీకాలను వేశారు. గర్భిణులకు కూడా వ్యాధి నిరోధక టీకాలు వేసి, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమలి, లక్ష్మీకాంతమ్మ, కృష్ణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంత్యుత్సవాలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో బుధవారం కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ దేవరాయల 553 జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన అధ్యక్షులు కావేటి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, నరేష్, జిల్లా గౌరవ సలహాదారు డేగల వెంకట్, జిల్లా కార్యదర్శి కోన చంద్రశేఖర్, సలహాదారు కురిమి శెట్టి గోవిందు, కిషోర్, బొగ్గు రాజశేఖర్, గుర్రం జయచంద్ర, కరుణాకర్, రెడ్డప్ప, కాసేటి రెడ్డప్ప, చంద్ర, నాగభూషణం, హరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్లను ఆర్డీఓ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆవిష్కరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రమేష్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నల చేతులమీదుగా బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మవరం తాలూకా అధ్యక్షులు సాయిప్రకాష్, కార్యదర్శి ఓబిలేసు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పూల నరసింహులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్

తనకల్లు: మండలంలో ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2024-25 ఏడాదికి గాను గ్రామాలలో చేపట్టబోయే పనుల కోసం ప్రణాళిలను సిద్ధంగా చేయాలని ఆదేశించారు. గ్రామాలలో తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు తదితర మౌళిక సదుపాలను కల్పించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనందయ్య, ఏఓ శ్రీహరినాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కవిత, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కండి

బత్తలపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2 రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో మొదటి రోజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచలు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే ఆదర్శం



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, తదితరులు

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం దేశానికే ఆదర్శమని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికను ఆర్టీసీ సిబ్బందితో కలసి ఆవిష్కరించి సిబ్బందిని ఆహ్వానించారు. అనంతరం డిపోలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ చరిత్రను బావిభారత పౌరులు తెలుసుకొనే విధంగా మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ, పార్టీ పదవుల్లో కూడా సముచిత స్థానం కల్పిస్తూ పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి ఉద్యోగ కార్మిక జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా జీతాలు చెల్లించి ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కులమతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, ఎంపీ విజయానంద, ఉషారాణి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బాబన్న, ముత్యాలప్ప, నరసింహులు, ప్రసాద్, రమణప్పతో పాటు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని ఉప్పార్లపల్లిలో జరుగుతున్న మట్టి రోడ్డు పనులను, కూలీలకు సంబంధించిన మస్టర్లను ఎంపీడీఓ శకుంతల బుధవారం పరిశీలించారు. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.272 పడేలా కొలతలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఆరిఫ్ ఖాన్‌కు సూచనలు చేశారు. పనులను గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్లు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఎన్‌పీకుంట: మండలంలో ఏర్పాటైన సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా విడుదలైన సీఎస్ఆర్ నిధులతో మండల కేంద్రంలోని వీధుల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

నేడు నీటి సరఫరా బంద్

ధర్మవరం అర్బన్: మున్సిపాలిటీ నీటి సరఫరాకు సంబంధించి తంబాపురం వాటర్ వర్క్స్ వద్ద పైపులైను లీకేజీ కావడంతో భారీగా నీరు వృథాగా పోతోందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైను మరమ్మతు కోసం వెల్డింగ్ చేయాల్సి ఉందన్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పట్టణానికి నీటి సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరా చేస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రత్యేక సమావేశం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి రూరల్ పరిధిలోని 14 గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళిక తయారీలో భాగంగా గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ మెంబర్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలన్నారు. 2024-25 సంవత్సరానికి అమగొండపాళ్యం, బొంతలపల్లి, చెర్లోపల్లి, దిగువచెర్లోపల్లి, ఇరగరాజుపల్లి, జగరాజుపల్లి, కప్పలబండ, కొట్లపల్లి, నిడిమామిడి, పైపల్లి, పెడపల్లి, రాచువారిపల్లి, వెంగళమ్మచెరువు, వెంకటగారిపల్లి పంచాయతీలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు.

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేశ్ ప్రసాద్

ఓడీచెరువు: అల్లాపల్లి పంచాయతీ చౌడంపల్లి మాజీ సర్పంచు గోరంట్ల వెంకటేశ్ ప్రసాద్ ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి వెంకటేశ్ ప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, మైనారిటీ కార్యదర్శి షామీర్ భాషా, మండల కన్వీనర్ రాజు నాయుడు, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు



జాయినింగ్ లెటర్ అందజేస్తున్న సీకేపల్లి అంగన్‌వాడీ కార్యకర్త సునీత

చెన్నేకొత్తపల్లి: వేతనాలు పెంచాలంటూ సమ్మె చేస్తున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. మండలంలోని వెంకటంపల్లిలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలు, మారుతిపురం, చెన్నేకొత్తపల్లిలోని 3, 2, నాగసముద్రం-1 పెనుగొండ వారిపల్లి ఎన్ఎస్ గేట్, పులేటిపల్లిలోని 2 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మిగిలిన వారు కూడా విధుల్లో చేరాలని సూచించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: మండలంలోని భోగినేపల్లి గ్రామానికి చెందిన పలు టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. బుధవారం అనంతపురంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో కురుబ కర్రే నాగేంద్ర, కర్రే ముత్యాలప్ప, కర్రే వన్నూరప్ప, కర్రే రామలింగమయ్య తదితరులు ఉన్నారు.